# 151. హేండిల్

ఓ గొప్ప చిత్రకారుడు చిత్రించిన చిత్ర ప్రదర్శనకి అనేక మంది వచ్చి చూడసాగారు. అన్నిటిలోకి అందరినీ ఆకర్షించిన చిత్రం, దేవుడు ఓ చేతిలో లాంతరు పట్టుకుని, ఇంకో చేత్తో తలుపు తడుతున్న చిత్రం. ఎంతో సహజంగా, ఆకర్షణీయమైన రంగులతో ఉన్న దాన్ని అంతా మెచ్చుకోసాగారు.

మధ్యాహ్నం ఆ ప్రదర్శనకి వచ్చిన ఒకతను ఆ చిత్రాన్ని పరిశీలించి తన పక్కనున్న మిత్రుడితో చెప్పాడు.

"అంతా బావుంది కాని చిత్రకారుడు ఓ పెద్ద పొరబాటు చేసాడు."

"నేను పట్టుకోలేకపోయాను. ఏమిటా పొరబాటు?" అడిగాడు అతని మిత్రుడు.

"తలుపుని చూడు. దానికి హేండిల్‌ని గీయడం మరిచాడు."

వెంటనే అతని వెనకే ఉన్న ఆ చిత్రకారుడు ఆ విమర్శకి జవాబు చెప్పాడు.

"అది పొరబాటు కాదు. ఆ తలుపు మనిషి హృదయం. దాన్ని లోపలనించి మాత్రమే తెరవగలం కాబట్టి హేండిల్ బయటకి ఉండదు."

# 152. ఎవరితో చెప్పుకోవాలి?

శివపార్వతులు ఓ రోజు కైలాసంలో కూర్చుని తమ భక్తుల గురించి మాట్లాడుకుంటున్నారు. అకస్మాత్తుగా శివుడు లేచి బయటకి పరిగెత్తసాగాడు. అంతలోనే శివుడు వెనుతిరిగి పార్వతి దగ్గరకి వచ్చేసాడు.

"ఏమిటి?" అడిగింది పార్వతి.

"కాశీలోని నా భక్తుడు ఇప్పుడే గుడి నించి ఇంటికి తిరిగి వెళ్తూంటే, కొందరు దుండగులు అతన్ని దొంగగా భావించి కొడుతున్నారు. అది తెలిసి అతన్ని రక్షించాలని బయలుదేరాను." చెప్పాడు శివుడు.